క్లుప్తంగా

అంధకారంలో డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డు



అంధకారంలో డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డు

అల్లిపురం: డొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డు నుంచి సౌత్ జైలురోడ్డు వరకు అంధకారం నిండుకుంది. వీధి దీపాలు వెలగకపోవటంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు తెలిపారు. చీకట్లో మహిళలు కాలినడకన ప్రయాణం చేయలేకపోతున్నారని వాపోతున్నారు. రోడ్డు గోతులమయం కావటంతో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియటం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పాడైన వీధి దీపాల స్థానంలో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు తెలిపారు. ఆకతాయిల బెడద కూడా ఎక్కువగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

డాబాగార్డెన్స్: సినీ రంగంలో ఎన్టీఆర్ ఒక ధ్రువ తార అని ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్యమండలి కార్యవర్గం పేర్కొంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏపీ చలన చిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుక నిర్వహించారు. ముందుగా మండలి సంయుక్త కార్యదర్శి ఎస్ఎస్ మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఎస్ భాష, ఏఎస్సార్ జిల్లా కోఆర్డినేటర్ కొరపల్లి బాబు, అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ ధర్మశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూతి వెంకటరెడ్డిని ఏపీ చలన చిత్ర వాణిజ్య మండలి విశాఖ జిల్లా కోఆర్డినేటర్‌గా ప్రకటించారు. జిల్లాలోని సినీ పరిశ్రమకు సంబంధించి 24 క్రాఫ్ట్స్‌లో ఉన్న వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెంకటరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరిగేలా, ప్రభుత్వం రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని కోరారు. విశాఖలో కూడా చిత్ర పరిశ్రమ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందని భావించి, కో ఆర్డినేటర్‌గా వ్యవహరించడానికి తాను అంగీకరించానన్నారు. కార్యక్రమంలో తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర ఉపాధ్యక్షుడు ఎం. కృష్ణకిషోర్, కళాకారులు, రమేష్ యాదవ్, రాజశేఖర్, వెంకటేష్ తదితరులు వెంకట్‌రెడ్డిని సత్కరించారు.

త్యాగాలకు ప్రతిరూపమే విశాఖ ఉక్కు



నిరసన శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ పార్కులో విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న దీక్షలు 1356వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జగదాంబ జోన్ నాయకులు, సభ్యులు శనివారం ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వై. రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణత్యాగం, 61 మంది కమ్యూనిస్టుల పదవీ త్యాగం, 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, భూములు, చివరికి దేవాలయాలు కోల్పోవడం ద్వారా వచ్చిందని గుర్తు చేశారు. ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కానీ ప్లాంట్ తాలూకు డివిడెండ్ల ద్వారా రూ. 50 వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఆర్జించిందని తెలిపారు. ప్లాంట్ పూర్తిగా విశాఖకు మాత్రమే చెందుతుందని, దీన్ని అమ్మే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. సీఐటీయూ నాయకుడు సంతోష్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె.నర్సింగరావు, హాస్పిటల్స్ యూనియన్ నాయకుడు నూకరాజు, కార్మికులు పాల్గొన్నారు.

ధనుర్మాస వైభవం

- దక్షిణలో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక శోభ
- ధనుర్మాసోత్సవాలకు దేవస్థానాలకు ప్రత్యేక ముస్తాబు
- ఆలయాల్లో రేపటి నుంచి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



ఘోషాస్పత్రి వద్ద గల సీతారామలక్ష్మణులు



బల్లిరూపంలో స్వామి

మూలవిరాట్టు పక్కనే బల్లిదేవుడి గుడి

అల్లిపురం: దక్షిణం ధనుర్మాస శోభ సంతరించుకుంది. నియోజకవర్గంలో శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయాలు ఉండటంతో భక్తి భావం వెల్లివిరిస్తోంది. దేవదాయ శాఖ కాస్త శ్రద్ధ చూపితే ఇక్కడి ఆలయాలన్నీ మరింత అభివృద్ధి చెందుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా అల్లిపురంలోని బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కంచర వీధిలోని ఎంబర్‌మన్నార్ దేవాలయం, ఘోషాస్పత్రి సమీపంలో గల సీతారామచంద్రస్వామి దేవాలయం, పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ధనుర్మాస పూజలు ఈ నెల 16వ తేదీ నుంచి అత్యంత వైభవంగా జరగనున్నాయి. భోగి రోజు వరకు ఆయా దేవాలయాల్లో పాశుర పఠనం నిత్యం జరుగుతుంది.

ధనుర్మాసంలో ముఖ్యమైన వైదిక కార్యక్రమాలు..

- 16వ తేదీ ఉదయం 4.30 గంటలకు నెలగంట, తిరుప్పావై సేవాకాలం, ధనుర్మాస సంకల్పం.
- 1, జనవరి 2025న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం
- 12వ తేదీన నీరాటోత్సవం, కల్యాణ దంపతులుగా శ్రీనివాసులు, గోదాదేవిల అలంకరణ
- 13వ తేదీ భోగి సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణోత్సవం
- 14వ తేదీ మకర సంక్రాంతి
- 15వ తేదీ కనుమ పండగ
- 16వ తేదీ వెంకటేశ్వరమెట్ట, బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి సనాతన పరస మహోత్సవం

దేవాలయాల ప్రాముఖ్యత



బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం 17వ శతాబ్దానికి చెందినదిగా చెప్పుకుంటారు. ఈ దేవస్థానంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి స్వయంభూగా బల్లిరూపంలో ఇక్కడ వెలిసారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. డచ్చివారు వ్యాపార నిమిత్తం సముద్రమార్గం గుండా వచ్చి ఇక్కడ సేద దీరిన సమయంలో వారి స్వప్నంలో కలియుగ వేంకటేశ్వరుడు కనిపించి తాను ఇక్కడ బల్లిరూపంలో వెలిసానని చెప్పటంతో స్వామి రూపం వారికి కనిపించటం, తర్వాతి కాలంలో ఇక్కడ దేవాలయ నిర్మాణం చేపట్టటంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ దేవాలయం స్వతహాగా ఉత్తర ద్వారం కావటంతో విశిష్టత సంతరించుకుంది. భోగి రోజు గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా చేపడతారు.

పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం..



వందేళ్ల చరిత్ర కలిగిన పోర్టు దేవస్థానం అభివద్ధిలో పోర్టు ట్రస్ట్ భాగస్వామి కావటం విశేషం. ఈ దేవాలయంలో స్వామి వారికి నిత్య ధూప దీప నైవేద్యాలు అందుతున్నాయి. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో స్వామి వార్షిక కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపడుతున్నారు. పోర్టు కార్గో అభివృద్ధి చెందటంతో పోర్టు వెంకన్న దేవాలయానికి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యాలు కరవయ్యాయి. దీంతో భక్తుల ఆదరణ తగ్గింది. అయినప్పటికీ పోర్టు వెంకన్న దేవాలయం అంటే తెలియని వారు ఉండరు. ఈ దేవస్థానంలో కూడా ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు.


ఎంబర్‌మన్నార్ దేవస్థానం..

15వ శతాబ్దానికి చెందిన ఎంబర్‌మన్నార్ దేవాలయం పాతనగరంలోని కంచరవీధిలో వెలసింది. వైశాఖ రాజుల పాలనలో ఈ దేవస్థానం నిత్య ధూపదీప నైవేద్యాలతో అలరారేది. వారి తదనంతరం దేవాలయానికి ఆదరణ తగ్గింది. కొంత కాలం తర్వాత భక్తులు చొరవ చూపి దేవాలయంలో పూజలు చేయటంతో తిరిగి ప్రాముఖ్యత సంతరించుకుంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పుడు స్వామికి ప్రత్యేక పూజలు, నిత్య ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాలు నెల రోజుల పాటు జరుపుతున్నారు. వైశాఖ మాసంలో స్వామి వార్షిక కల్యాణం ఉంటుంది.



కంచర వీధిలోని ఎంబర్‌మన్నార్ స్వామి దేవస్థానం

కోదండరామస్వామి దేవస్థానం



ఘోషాస్పత్రి దరి కోదండ రామస్వామి దేవస్థానం 800 ఏళ్ల నాటిదిగా ఆలయ చరిత్ర చెబుతోంది. ఈ దేవస్థానంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు సముద్రంలో లభించినట్లు స్థానికుల కథనం. వాటిని ఇక్కడ ఏర్పాటు చేసి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని ప్రతీతి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజున స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా చేపట్టటం విశేషం.

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 13వ రోజు శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, అమ్మవారికి సహస్రనామార్చన నిర్వహించారు. 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

కనకమహాలక్ష్మి అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్‌కొత్త రోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ రాజ్‌కుమార్‌కు డాక్టరేట్



ఫాదర్ రాజ్‌కుమార్

కంచరపాలెం: విశాఖ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల భావోద్వేగ ప్రజ్ఞ, బోధనా సామర్థ్యం, బోధనాభిరుచుల మధ్య ఉండే పరస్పర సంబంధాలపై నగరానికి చెందిన ఫాదర్ చిటికెల రాజ్‌కుమార్ పరిశోధనలు చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఆచార్యులు ఆర్. శివప్రసాద్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయడంతో ఆయనకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్‌గా, సెయింట్ మేరీస్ విద్యా సంస్థలకు ప్రిన్సిపాల్‌గా అనేక సేవలు అందించిన రాజ్‌కుమార్‌కు డాక్టరేట్ రావడంతో జ్ఞానాపురం ప్రజలు, క్రైస్తవ సోదరులు ఆనందం వ్యక్తం చేశారు.

జగన్‌ను విమర్శించే అర్హత అవంతికి లేదు

- వైఎస్సార్‌సీపీ నేత ఆల్ఫా కృష్ణ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత ఆల్ఫా కృష్ణ

డాబాగార్డెన్స్: నిబద్ధత, నీతి, నిజాయితీ, విశ్వాసం లేని వ్యక్తి అవంతి శ్రీనివాస్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఆల్ఫా కృష్ణ తీవ్రంగా దుయ్యబట్టారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మార్చే అలవాటు అవంతికి ఉందని, ఇప్పటికే నాలుగు పార్టీలు మారారని, అటువంటి వ్యక్తి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. అవంతి శ్రీనివాస్ రాజీనామా సమయంలో కొన్ని అభ్యంతరకర మాటలు మాట్లాడారని, జగన్‌పైన, వైఎస్సార్‌సీపీపైన ఆరోపణలు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

జగన్ హయాంలో శాసన సభ్యుడిగా, మంత్రిగా పని చేసిన అవంతి శ్రీనివాస్ ప్రస్తుతం పార్టీ కష్ట పరిస్థితుల్లో ఉండగా, విడిచిపెట్టి నోటికి వచ్చినట్టుగా మాట్లాడడం నమ్మక ద్రోహానికి పాల్పడటమేనన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వల్ల కార్యకర్తలు, నాయకులు నష్టపోలేదన్నారు. పార్టీ నాయకులకు అనేక పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకున్నారని, మార్పు తీసుకొచ్చారని తెలిపారు. అవంతి శ్రీనివాస్ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతారని ఎద్దేవా చేశారు. ప్రజలపై ఎటువంటి ప్రేమ లేదన్నారు. ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీలు మారుతున్నారని, అవంతి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్యాటక శాఖ మంత్రిగా అవంతి చేసిన సేవలేంటో తెలపాలని ప్రశ్నించారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం ఆలోచించే భీమిలికి పట్టిన శని వదిలిందన్నారు.భీమిలిలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని అవంతి శ్రీనివాస్‌కు సవాల్ చేశారు.

ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు



ద్వారకానగర్‌లో పుత్‌పాత్ కనిపించకుండా వాహనాల పార్కింగ్



ద్వారకానగర్‌లో సగం ఫుట్‌పాత్‌పై.. సగం రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు.. పక్కన రోడ్డు మీద ఆపిన వ్యాన్

- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: నగరంలో నిత్యం జనసమర్థంగా ఉండే ప్రాంతాల్లో ద్వారకానగర్ ఒకటి. అధిక సంఖ్యలో బ్యాంకులు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, షాపింగ్‌మాల్స్, థియేటర్లు ఉన్న ప్రాంతం ఇది. ఈ ప్రాంతంలో పాదచారుల కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లన్నీ వాహనాల పార్కింగ్‌తో పూర్తిగా మాయం అయిపోతున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. ద్వారకానగర్‌లో గల ప్రతి ఫుట్‌పాత్ మీదా ఆక్రమణలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రతి షాపింగ్ కాంప్లెక్సుని అనుకుని ఉన్న ఫుట్‌పాత్ మీద ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడం దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు. ద్వారకానగర్ నాలుగు లైన్లు, డైమండ్ పార్కు ప్రాంతంలో గల ఫుట్‌పాత్‌ల మీద ఆక్రమణలు అన్నీ ఇన్నీ కావు. కాగా ఇక్కడ పలు వాణిజ్య సముదాయాల్లో సెల్లార్ పార్కింగ్ సదుపాయం వుండనే వుంది. కాని అధిక సంఖ్యలో వినియోగదారులు, ఉద్యోగులు తమ ద్విచక్ర వాహనాలను ఎందుకనో మొదటి నుంచి ఫుట్‌పాత్‌ల మీదే పార్కింగ్ చేస్తున్నారు. ఆయా దుకాణాలు, బ్యాంకుల వద్ద ఉండే సెక్యూరిటీ గార్డులు కూడా వాహనాలు సెల్లార్‌లో మాత్రమే పెట్టుకోవాలని చెప్పిన పాపాన పోవడం లేదు. ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు వాహనాల ఆక్రమణతో నిండిపోతున్నా ద్వారకా ట్రాఫిక్ పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని పాదచారులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలోని బ్యాంకుల వద్ద నగదు తీసుకెళ్లే వాహనాలు రోడ్డు మీదనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ద్వారకానగర్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌ల మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, పాదచారులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి అన్న ప్రసాద వితరణకు విరాళం



చెక్కు అందజేస్తున్న భక్తురాలు దుర్గ

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో శాశ్వత అన్న ప్రసాద వితరణకు నగరంలోని అల్లిపురం ప్రాంతానికి చెందిన కె. దుర్గ రూ.లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావుకు ఆ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు.

‘40 ఏళ్ల స్నేహం’ సావనీర్ ఆవిష్కరణ



అప్పటి ఉపాధ్యాయుల చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరింపజేస్తున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన 1984 బ్యాచ్ విద్యార్థులు రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీనిలో భాగంగా 40 ఏళ్ల స్నేహం.. సావనీర్‌ను అప్పటి ఉపాధ్యాయుల చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డీవీ చలం మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో గడచిన రెండు దశాబ్దాల్లో చేపట్టిన వివిధ కార్యక్రమాలు వివరించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కె. చంద్రశేఖరం, రాదా ప్రసాదరావు, మరియదాస్, జోజిబాబు, డి. కొండలరావు, ప్రసాదరావు తదితరులు పూర్వ విద్యార్థుల సేవలను కొనియాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో నాలుగు సెక్షన్ల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్. శివశంకర్, కె. గురునాథరావు, విక్రమాదిత్యవర్మ, ఆనంద్, రత్నకుమార్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూతగా ఉచిత వివాహాలు

డాబాగార్డెన్స్: పాతనగరం వుడ్‌యార్డ్ స్ట్రీట్‌లో గల శ్రీవాసవీ కల్యాణ మండపం సంఘం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 22న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు విన్నకోట రామమూర్తి, కార్యదర్శి కందుల మూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం మండపం ఆవరణలో ఉచిత సామూహిక వివాహాల పోస్టర్‌ను కమిటీ చైర్మన్ కందుల మధుబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోని వారైనా, నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల యువతీ యువకులకు వారి పెద్దల అభీష్టం మేరకు వివాహాలు జరుపుతామన్నారు. వధూవరుల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత 24 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివాహ సమయంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెని చేసిన దగ్గర నుంచి మంగళ సూత్రాలు, బాసికాలు, కంకణం, ఉంగరం, వధువు కాలికి మట్టెలు, కల్యాణ మండపం ఖర్చు, పురోహితుని ఖర్చు, మంగళ వాయిద్యాలు, వివాహ సమయాన భోజన ఖర్చు, అమ్మాయిని అత్త వారింటికి పంపించే సమయంలో సాంప్రదాయబద్ధంగా ఇచ్చే సారె, వధూవరులిద్దరూ కలిసి జీవించడానికి అవసరమయ్యే నిత్యావసర వస్తు సామగ్రి ఖర్చు మొత్తం సంఘం సభ్యులు, దాతల నుంచి సేకరించిన విరాళాల రూపంలో అందజేస్తామన్నారు. ఉచిత వివాహాలకు సంబంధించి 9296652047, 8074131406 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మామిడి వీరభద్రరావు, యలమర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 'ఘంటసాల గానోత్సవాలు' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. విశ్వప్రసాద్, కోమలి ఆలపించిన నాలోని రాగమీవే.. రామ్ నరసింహం, సీవీ రాజేశ్వరి పాడిన కోవెల ఎరుగని, శ్రీనివాస్‌కుమార్, సీవీ రాజేశ్వరి ఆలపించిన ఏ శుభ సమయంలో, బంగార్రాజు, భాగ్యలక్ష్మి పాడిన ఒకసారి కలోకి రావయ్యా, రామారావు, సుజాత పాడిన చిగురాకులలో చిలుకమ్మా, విశ్వప్రసాద్, మురళీ కోమలి పాడిన మధురాతి మధురం వంటి మధుర గీతాలు ప్రేక్షకుల్ని తన్మయత్వంలో ముంచెత్తాయి. కీబోర్డుపై సోమేష్, తబలాపై చక్రపాణి, అప్పలరాజు, ప్యాడ్స్‌పై బాబ్జి, కాంగోపై పైడిరాజు చక్కని సంగీతాన్ని అందించారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి డెంటల్ కేర్ అధినేత డాక్టర్ కేఎంకే రమేష్, కళాసేవకుడు కొణతాల రాజు, జి. త్యాగరాజన్, సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.